క్లుప్తంగా

జాతీయ స్థాయి యోగా పోటీలకు యశ్వంత్



యశ్వంత్‌కుమార్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, కౌన్సిలర్

సామర్లకోట: జాతీయ స్థాయి యోగా పోటీలకు సామర్లకోట బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థి కిల్లాడి యశ్వంత్‌కుమార్ ఎంపికయ్యాడు. అతడు ద్వితీయ స్థానం సాధించడంతో జాతీయ పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం తోటకూర సాయిరామకృష్ణ, పీడీ తాళ్లూరి వైకుంఠం గురువారం విలేకర్లకు తెలిపారు. ఈనెల 18, 19 తేదిల్లో నరసాపురంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరచిని యశ్వంత్‌కుమారను వారు అభినందించారు. ఒరిస్సాలోని కటక్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో అతడు పాల్గొంటాడని చెప్పారు. ఈ సందర్భంగా బాలుడికి వారు కౌన్సిలర్ బలువు వాసుతో కలసి రూ.రెండు వేలు అందజేశారు. ఈకార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ చందలాడ శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ పి.మాధవీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో ప్రమాదాల నివారణ



ఆపదమిత్రలకు శిక్షణ ఇస్తున్న శివకుమార్

సామర్లకోట: ప్రమాదాలను గుర్తించిన వెంటనే ఆపద మిత్రలు అప్రమత్తమైతే పెను ప్రమాదాలను నివారించవచ్చని రాష్ట్ర విపత్తుల నివారణ సంస్థ ప్రాజెక్టు అధికారి డి.శివకుమార్ అన్నారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో తూర్పుగోదావరి, అనకాపల్లి జిల్లాల ఆపద మిత్రల శిక్షణలో భాగంగా గురువారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రమాదాలను గుర్తించడం, క్షతగాత్రులను రక్షించడంపై ప్రయోగాత్మకంగా వివరించారు. ప్రకృతి విపత్తులపై అధికారుల ప్రకటనలను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని తెలిపారు. ప్రజల ప్రాణాలకు హని కలిగించే జంతువులను గుర్తించిన సమయంలో అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని అటవిశాఖ స్టేషన్ అధికారి వెంకటేశ్వరరావు (రాజమహేంద్రవరం) సూచించారు. ఈ శిక్షణలో ఫ్యాకల్టీలు శ్రీదేవి, డి.దినేష్, ఎం.శ్రీనివాసరావు, జీవీ రమణ, కేఎస్ కొండలరావు శిక్షణ ఇచ్చారు.

ఘనంగా బద్దిగడుగు ఉత్సవం



నూకాలమ్మ ఆలయం వద్ద బద్దిని తీసుకువస్తున్న ఆసాదులు

పెద్దాపురం: కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి బద్దిగడుగు ఉత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఏటా ఉగాది రోజున అమ్మవారి ఆలయ తలుపులు మూసివేసి మరుసటి రోజున ఆలయ తలుపులు తెరచి బద్ది ఉత్సవాన్ని నిర్వహిస్తుంటారు. భాజాభజంత్రీలతో ఏలేరు నదికి వెళ్లి బద్దిని కడిగి తీసుకు వచ్చి అమ్మవారి ఆలయంలో ఉంచుతారు. గరగను పూజించి అమ్మవారికి దీప, ధూప నేవేద్యాలు సమర్పించారు. ఆలయ చైర్మన్ గవరసాని వీరాస్వామి, ఆలయ ఈఓ తలాటం వెంకట సూర్యనారాయణ, ఆలయ ఆసాదులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు



పిఠాపురం-నాగులపల్లి రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం

కొత్తపల్లి: పిఠాపురం-నాగులపల్లి రోడ్డు అభివృద్ధి పనుల్లో భాగంగా రోడ్డు మధ్యలో ఉన్న స్తంభాలను తొలగించాలి. అయితే స్తంభాలు తొలగించకపోవడంతోప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గత మూడేళ్లు అభివృద్ధి పనులు జరుగుతున్నా ఆ స్తంభాన్ని మాత్రం తొలగించడంలేదు. దీనివల్ల ప్రయాణికులు ప్రమాదబారిన పడుతున్నారు.

మొక్కవోని నిర్లక్ష్యం

- శిథిలమవుతున్న వంతెన గోడలు
- కాను నుంచి బయటకు వచ్చిన ఊచలు
- పెరుగుతున్న లోడ్ వాహనాల రాకపోకలు



సత్యనారాయణపురం కానులో బయటకు వచ్చిన ఇనుప ఊచలు



బ్రిడ్జి గోడలో పెరిగిన మొక్కలు

సామర్లకోట: స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జిపై అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో బ్రిడ్జి శిథిలావస్థకు చేరుతోంది. 1973 మే 28న అప్పటి సీఎం జలగం వెంగళరావు ఈ బ్రిడ్జిని ప్రారంభించి ప్రజలకు రైల్వే గేటు కష్టాలను తీర్చారు.

ఈ బ్రిడ్జితో సామర్లకోట నుంచి కాకినాడ, కెనాల్ రోడ్డులో రాజమహేంద్రవరం వెళ్లడానికి మార్గం సుగమమైంది. మరో వైపు ఏడీబీ రోడ్డు పనులలో భాగంగా రాజానగరం నుంచి కాకినాడ పోర్టుకు ఈ ఫ్లై ఓవర్‌ను కలుపుతూ పెద్దాపురం ఏడీబీ రోడ్డు నిర్మించారు. దాంతో సామర్లకోట నుంచి రాజానగరం మీదుగా రాజమహేంద్రవరం వెళ్లడానికి రహదారి ఏర్పడింది. ఇంత ప్రాధాన్యమున్న ఈ ఫ్లైఓవర్ అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల శిథిలావస్థకు చేరే పరిస్థితి ఏర్పడుతోంది. సత్యనారాయణపురానికి వెళ్లే మార్గంలో బ్రిడ్జి గోడ పెచ్చులు ఊడడం, రైల్వే కార్టర్స్ కాను గోడ బీటలు వేయడంతో ఇనుప ఊచలు బయటకు కనపడుతున్నాయి. ఆ బీటలకు మరమ్మతులు చేయకుంటే ఆకతాయిలు ఆ ఊచలను కోసి తీసుకుపోయే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గోడల బీటల నుంచి వృక్షాలు..

ఫ్లైఓవర్‌కు బీటలు పడిన చోట మొక్కలు పెరిగి వృక్షాలుగా పెరిగిపోతున్నాయి. అలాగే ఈ వంతెనపై నుంచి సుమారు 60 నుంచి 80 టన్నుల బరువైన లోడుతో వాహనాలు యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తుండడంతో 50 ఏళ్ల క్రితం నాటి నిర్మాణం దెబ్బతినే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ వంతెన దెబ్బతింటే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురికావలసి వస్తుంది.

ఇంటర్ చదువుతున్న సమయంలో ప్రారంభించారు



స్థానిక షుగర్ ఫ్యాక్టరీ గేటు వద్ద ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడుతుండడంతో ఈ వంతెన నిర్మించారు. అప్పుడు నేను ఇంటర్ చదువుతున్న రోజులు. వంతెన దెబ్బతిన్న చోట రంగులు వేసి సరిపెడుతున్నారు తప్ప పూర్తి స్థాయి మరమ్మతులు చేయడం లేదు. ఇప్పటి నుంచే మరో వంతెన నిర్మాణానికి దృష్టిపెట్టాలి.

– పోతుల వీర్రాజు, రోటరీ క్లబ్ సభ్యుడు, సామర్లకోట

ఆర్‌అండ్‌బీ అధికారులకు వివరిస్తాం..



ఫ్లైఓవర్ నిర్వాహణ ఆర్‌అండ్‌బీ అధికారులు చేయాల్సి ఉంది. వంతెన సమస్యలను ఆర్‌అండ్‌బీ, రైల్వే అధికారుల దృష్టికి తీసుకు వెళతాం. ఫ్లైఓవర్‌పై తరుచూ పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నాం.

– నయీం అహ్మద్, మున్సిపల్ కమిషనర్, సామర్లకోట

జగన్ పాలన ఇతర రాష్ట్రాలకు ఆదర్శం



మాధవపట్నం గ్రామంలో లబ్ధిదారులు పొందిన పథకాలను వివరిస్తున్న దవులూరి దొరబాబు

- రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు
- మాధవపట్నంలో గడప గడపకు మన ప్రభుత్వం

సామర్లకోట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శవంతమైన పాలన సాగిస్తున్నారని, ఆయన పాలనపై అనేక రాష్ట్రాలు దృష్టి సారిస్తున్నాయని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. గురువారం సాయంత్రం సర్పంచ్ మేడిశెట్టి సుగుణమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ మేడిశెట్టి వీరభద్రం, ఎంపీటీసీ సభ్యులు మేడిశెట్టి దుర్గాదేవి, గుత్తుల కృష్ణార్జునరావు ఆధ్వర్యంలో ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. వివిధ పథకాలు అందుకున్న లబ్ధిదారులను కలసి వాటి పంపిణీపై ఆరా తీశారు. వలంటీర్లతో పాటు గృహ సారథులు కూడా ఇంటింటికీ వచ్చి ప్రజల సమస్యలు తెలుసుకుంటారని దొరబాబు చెప్పారు. అర్హత ఉంటే సచివాలయ సిబ్బంది పథకాలకు ఎంపిక చేస్తారని, రాజకీయ నాయకుల ప్రమేయం అవసరం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను తిరిగి సీఎంగా చేయడానికి ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మేడిశెట్టి వెంకటరమణ, మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ అచ్చిరాజు, పంచాయతీ కార్యదర్శి సాధనాల నాగఫణిబాబు, సొసైటీ అధ్యక్షులు వీరంరెడ్డి నాని, వుటా వాసు పార్టీ నాయకులు తోలెం లోవరాజు, తోట సత్తిబాబు, వీఆర్వోలు సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నాణ్యమైన శిక్షణ అందించాలి

జెడ్పీ సీఈఓ సత్యనారాయణ



ఉండూరులో స్వచ్ఛ సంకల్పంపై మాట్లాడుతున్న సీఈఓ సత్యనారాయణ

సామర్లకోట: స్వచ్ఛ సంకల్పంపై వివిధ మండలాల నుంచి వచ్చే సిబ్బందికి నాణ్యతతో కూడిన శిక్షణ ఇవ్వాలని జెడ్పీ సీఈఓ ఎస్.సత్యనారాయణ అన్నారు. మండల పరిధిలో ఉండూరు గ్రామంలో జగనన్న స్వచ్ఛ సంకల్పంపై గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ శిక్షణకు జిల్లా నుంచి ఉండూరు యూనిట్‌ను ఎంపిక చేశామని, ఇక్కడ పొందిన శిక్షణను మోడల్ గ్రామాలుగా ఎంపికైన స్థానిక అధికారులకు వివరించాలని తెలిపారు. సామర్లకోట మండలం నుంచి అచ్చంపేట, పనసపాడు, గొల్లప్రోలు మండలం నుంచి ఏపీ మల్లవరం, చేబ్రోలు, పిఠాపురం మండలం నుంచి ఎఫ్‌కే పాలెం, చిత్రాడ, తొండంగి మండలం నుంచి తొండంగి, ఏవీ నగరం, ప్రత్తిపాడు మండలం నుంచి ధర్మవరం, ఉత్తరకంచి, జగ్గంపేట మండలంలో గోవిందపురం, రాజపూడి, కిర్లంపూడి మండలం నుంచి బూరుగపూడి, సోమరాయనిపేట, తామరాడ, సోమవరం, సుంగరాయనిపాలెం, సింహాద్రిపురం, రాజుపాలెం, పాలెం, ముక్కోలు, కృష్ణవరం, జగపతినగరం, గోనేడ, గెదనాపల్లి, రామకృష్ణపురం, వీరవరం, భూపాలపట్నం, ఎస్. తిమ్మాపురం, వేలంక, రామచంద్రపురం గ్రామాల్లోని పంచాయతీ సర్పంచ్, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి, అగ్రికల్చర్ అసిసెంట్, ఇంజినీరింగ్ అసిసెంట్లకు శిక్షణ ఇవ్వాల్సి ఉందని వివరించారు. అన్ని గ్రామాలు శుభ్రంగా ఉండాలనే లక్ష్యంతో ఈ నెల 31 నుంచి జగనన్న స్వచ్ఛ సంకల్పం ప్రారంభమవుతుందన్నారు. ప్రతి గ్రామంలోను చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఏర్పాటు కావాలని పిలుపునిచ్చారు. డీపీఓ విక్టర్, ఎంపీడీఓ డి.శ్రీలలిత, పంచాయతీ కార్యదర్శి కుమార్‌రాజా, పంచాయతీ సర్పంచ్ పంతాడి ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. వర్మీ కంపోస్టు యూనిట్‌ను సీఈఓ, డీపీఓలు పరిశీలించారు.

ప్రజలకు ఉత్తమ సేవలందించాలి

వార్డు కన్వీనర్ల సమావేశంలో దొరబాబు



సామర్లకోట వార్డు కన్వీనర్ల సమావేశంలో మాట్లాడుతున్న దొరబాబు

సామర్లకోట: ప్రజలకు మరింత ఉత్తమ సేవలందించడానికి వార్డు కన్వీనర్లు పని చేయాలని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో పట్టణ పరిధిలోని వార్డు కన్వీనర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఇప్పటికే నియమించిన గృహసారథులకు అదనంగా మరో గృహ సారథిని నియమించుకోవాలన్నారు. ప్రతి వార్డుకు ముగ్గురు చొప్పున గృహ సారథులు ఉండేలా చూడాలని సూచించారు. గృహసారథులు, వలంటీర్ల బంధువులైతే మరింత ప్రయోజనమని వివరించారు. వలంటీర్లు, గృహసారథులు కలిసి పని చేస్తే ప్రజలకు ప్రభుత్వ పథకాలు వేగంగా చేరే అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రతి రెండు సచివాలయాలకు ఒకసారి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, గృహ సారథుల పట్టణ కన్వీనర్ ఇరుసుమళ్ల సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవర్చుకోవాలి

వృద్ధులకు చీరల పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న విలియమ్స్

కొత్తపల్లి: సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవర్చుకోవాలని జిల్లా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా వినియోగదారులు రక్షణ సమితి చైర్మన్ డాక్టర్ ఎంఎస్ విలీయమ్స్ అన్నారు. స్థానిక ముప్పారపు అచ్చియమ్మ కల్యాణ మండపంలో గురువారం మదర్ ఇండియా ఇంటర్నేషనల్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వినియోగదారుల రక్షణ సమితి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విలీయమ్స్, తన సతీమణి మార్లెళ్ల అన్నామణి ఆధ్వర్యంలో వృద్ధులు, వితంతువులకు చీరలను, దుప్పట్లను అందజేశారు. మదర్ ఇండియా ఇంటర్నేషన్ సంస్థ తరపున అన్నామణికి భారత మహిళా గోల్డ్ అవార్డు, శారా స్కూల్ ఆఫ్ నరసింగ్ డైరెక్టర్ స్టీఫెన్ ఆనంద్‌కు మ్యాన్ ఆఫ్ ఇండియా అవార్డును అందజేసి, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా విలియమ్స్ మాట్లాడుతూ అన్నామణి ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను చేపట్టామన్నారు.

కొత్తపల్లిలో సుమారు 500 మంది వృద్ధులు, వితంతువులకు చీరలు, దుప్పట్లతో పాటు ఆహారాన్ని పంపిణీ చేయడం చాలా సంతోషమన్నారు. వితంతువులకు కుట్టుమెషీన్లు, వికలాంగులకు ట్రైసైకిళ్లను త్వరలో పంపిణీ చేయనున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మదర్ ఇండియా ఇంటర్‌నేషన్ చైర్మన్ పిల్లి తిరుపతిరావు, భారతీయ జనతా పార్టీ నాయకుడు గట్టి సత్యనాయణ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

గంటా తరుణ్‌కు అభినందన



తరుణ్‌ను అభినందిస్తున్న మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు

తుని: హైరేంజ్ వరల్డ్ రికార్డులో సత్తా చాటిన స్థానిక సీతారాంపురానికి చెందిన గంటా తరుణ్‌ను మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువత అధ్యక్షుడు ఏలూరి బాలు అభినందించారు. గత నెల 27న హైదరాబాదులో జరిగిన మోస్టు ఫుల్ ఎక్స్‌టాన్సన్ 1 హ్యాండ్ పంచెస్ హోల్డింగ్ 1 కేజీస్ వెయిట్‌లో స్థానిక సీతారాంపురానికి చెందిన గంటా తరుణ్ సత్తా చాటాడు. ఒక్క నిముషంలో 150 పంచెస్ ఆడి తరుణ్ ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన తరుణ్‌ను నిర్వాహకులు సర్టిఫికెట్, మెమోంటోతో సత్కరించారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమలో వార్డు కౌన్సిలర్లు షేక్ క్వాజా, సునీత, గంటా కొండలరావు, గంటా సత్యవతి, పులుగు రాజు, మైలపల్లి నాగేశ్వరరావు, ఆరుగుల ప్రసాద్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పూడిక తీయరు.. తీస్తే తొలగించరు..



మెహర్ కాంప్లెక్స్‌లో చెరువుగా మారిన రహదారి

సామర్లకోట: మున్సిపల్ పారిశుధ్య అధికారుల నిర్లక్ష్యంతో డ్రైన్లలో పూడిక పేరుకుపోతోంది. కనీసం వారానికి ఒకసారి కూడా తీయక పోవడంతో అనేక డ్రైన్లు పొంగి ప్రవహిస్తున్నాయి. తీసిన పూడిగను వెంటనే తొలగించక పోవడంతో వర్షపు నీరు డ్రైనులోనికి పాయే అవకాశం లేక రోడ్లు చెరువులుగా మారుతున్నాయి. గురువారం మధ్యాహ్నం కేవలం ఐదు నిమిషాలు మాత్రమే కురిసిన వర్షానికి మెహర్ కాంప్లెక్స్‌లోని ఆస్పత్రి రోడ్డు, సత్యనారాయణపురంలోని రోడ్లు చెరువులుగా మారాయి. సత్యనారాయణపురంలో ఉన్న ప్రధాన డ్రైనులో చెత్త పెరిగి పొవడంతో వర్షానికి డ్రైను పొంగి ప్రవహించి నీరు రోడ్డుపై ప్రవహించింది. అలాగే మెహర్ కాంప్లెక్స్ నుంచి పశువుల ఆస్పత్రికి వెళ్లే రోడ్డులో డ్రైను నుంచి తీసిన పూడిగ తొలగించక పోవడంతో ఆ రోడ్డు చెరువుగా మారింది.

నవ సమాజ చైతన్యానికి యువత కృషి చేయాలి



భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న క్రాంతి తదితరులు



సామర్లకోటలో రక్తదానం చేసిన సీఐటీయూ నాయకులు



చేబ్రోలులో భగత్‌సింగ్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు



సామర్లకోటలో సాగుతున్న కాగడాల ర్యాలీ

పెద్దాపురం: నవ సమాజ నిర్మాణ చైతన్యానికి యువత కృషి చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ 92వ వర్ధంతిని బుధవారం డీవైఎఫ్ఐ, సీఐటీయూ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని నువ్వులగుంట వీధి భగత్‌సింగ్ విగ్రహం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ కన్వీనర్ కూనిరెడ్డి రవి అధ్యక్షతన జరిగిన సభలో మండల కార్యదర్శి రొంగల అరుణ్, చింతల సత్యనారాయణ, తాడిశెట్టి గంగ, నీలం శ్రీను, కరణం అప్పారావు మాట్లాడుతూ దేశ స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోసం పోరాడిన విప్లవ కిశోరాలు షహీద్ భగత్‌సింగ్, రాజ్‌దేవ్, సుఖదేవ్‌లన్నారు. వారి ఆశయ సాధన కోసం నేటి యువత కృషి చేయాలన్నారు. అనంతరం సీఐటీయూ నాయకులు డి.క్రాంతికుమార్, ఐద్వా నాయకులు కూనిరెడ్డి అరుణ మాట్లాడారు. తొలుత భగత్‌సింగ్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సిరిపురపు శ్రీనివాస్, ప్రజా నాట్యమండలి కళాకారులు దారపురెడ్డి సత్యనారాయణ, మహాపాతిన రాంబాబు, కె.అప్పన్న తదితరులు పాల్గొన్నారు. పులిమేరులో రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన భగత్‌సింగ్ వర్ధంతిలో కర్నాకుల రామలింగేశ్వరరావు, వి.సుధాకర్, కడితి సతీష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి

పిఠాపురం: నియోజకవర్గంలో స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల వర్ధంతిని నిర్వహించారు. పిఠాపురం నండూరి ప్రసాదరావు భవనంలో వామపక్ష నేతలు కుంచే చిన్న, కోనేటి రాజు, కరణం విశ్వనాథం, కె.నాగేశ్వరరావు, కె.మణి, డి.సత్యనారాయణ, శ్రీను, జీఎస్ భాస్కర్, గోవింద్, ఎం.రాంబాబు తదితరులు భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఎస్ఎఫ్ఐ నాయకులు సిద్దు, శ్రీకాంత్, ప్రకాష్, లోవరాజు, వెంకటేష్, చిన్న, ప్రసన్న తదితరులు భగత్‌సింగ్ విగ్రహానికి పూల మాలలతో ఘనంగా నివాళులర్పించారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో సీఐటీయూ మండల నాయకులు నందీశ్వరుడు, కె.చిన్నల ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు పెద్దింటి రమణ, టి.రవి, ఆనంద్, శ్రీను, సూర్యావతి, గంగా, రమణమ్మ తదితరులు భగత్‌సింగ్ చిత్ర పటానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు.

సామర్లకోట: భగత్‌సింగ్ రాజ్‌గురు 92వ వర్ధంతిని స్థానిక మెహర్ కాంప్లెక్స్‌లోని భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రంలో గురువారం నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి సీఐటీయూ నాయకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషుబాబ్జీ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రోటరీ బ్లడ్ బ్యాంకు డాక్టర్ పసుపులేటి కామరాజు రక్తాన్ని సేకరించారు. భగత్ సింగ్ విజ్ఞాన కేంద్ర అధ్యక్ష, కార్యదర్శులు కరణం ప్రసాదరావు, బాలం శ్రీనివాసు, సీఐటీయూ నాయకులు విప్పర్తి కొండలరావు, కె నాగమణి చెక్కల రాజ్‌కుమార్, వి అప్పలరాజు పాల్గొన్నారు.

కాగడాల ప్రదర్శన

సామర్లకోట: భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా గురువారం రాత్రి పట్టణ సీపీఎం, సీఐటీయూల ఆధ్వర్యంలో భారీ కాగడాల ర్యాలీ ప్రదర్శన జరిగింది. స్థానిక మెహర్ కాంప్లెక్స్ నుంచి మఠంసెంటర్, స్టేషన్ సెంటర్, రథం సెంటర్, దేవిచౌక్, నీలమ్మ చెరువు, గొల్లగూడెం మీదుగా ర్యాలీ బళ్లమార్కెట్ సెంటర్‌కు చేరింది. భగత్‌సింగ్‌కు జోహర్లు అర్పిస్తూ ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కరణం ప్రసాదరావు, బాలం శ్రీనివాసు, విప్పర్తి కొండలరావు, ఎస్‌కే ఫాతిమాబీబీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కొత్తపల్లి: రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా వాతావరణ మార్పుతో వర్షాలు కురుస్తున్నాయి. ఈ సమయంలో ప్రజలు జ్వరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి మౌనిక అన్నారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఇప్పటికే ఫ్లూ జ్వరాలు, జలుబులతో పిల్లలు బాధపడుతున్నారన్నారు. చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే సీజనల్ వ్యాధుల నుంచి బయడపడొచ్చన్నారు. పరిసర ప్రాంతాల్లో నీరు నిలువు లేకుండా చూసుకోవాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. మూడు రోజుల పాటు జ్వరం ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

వేగుళ్లమ్మకు పూజలు



పిఠాపురం: గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామ దేవత వేగుళ్లమ్మ తల్లి జన్మదిన పూజలు గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు దత్తు సోదరులు అమ్మవారికి అభ్యంగన స్నానం ఆచరించి పంచామృతాభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమివ్వగా సౌభాగ్య స్త్రీలచే లలితాదేవి సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సామర్లకోట: అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న ఆయా పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సీడీపీఓ జి.ఉష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 15వ వార్డులో మాసరమ్మ గుడి, పాత్రులపేట, 17వ వార్డులో రెల్లిపేట, 14వ వార్డులో సంగీతరావుపేట, ఒకటో వార్డులో రాజీవ్ గృహకల్ప, 31వ వార్డులో భాస్కర్‌నగర్-1, పెద్దాపురం పట్టణ పరిధిలో 27వ వార్డులో రాజీవ్ గృహకల్ప-2, 18వ వార్డులో పరదేశమ్మ కాలనీ, 11వ వార్డులో కొండయ్యపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి కలిగిన స్థానికులు ఈనెల 31వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యం

- ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు
- కరప పోలీసు స్టేషన్‌లో రికార్డుల తనిఖీ



కరప పోలీసుస్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు

కరప: మహిళల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసుశాఖ పనిచేస్తున్నట్టు ఎస్పీ ఎం.రవీంద్రనాథ్‌బాబు అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌ను గురువారం రాత్రి ఆయన తనిఖీ చేశారు. కోవిడ్ తర్వాత సంప్రదాయబద్ధంగా పండగలు చేసుకుంటున్నారని, ఉత్సవాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ తెలిపారు. పరివర్తన ద్వారా రెండేళ్లుగా గంజాయిసాగు తగ్గించామన్నారు. గంజాయి రవాణా చేస్తూ పట్టుబడ్డ ముద్దాయిలపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేసి, శిక్షపడేలా చేస్తున్నామన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులు, వేధింపులపై గట్టి నిఘా ఏర్పాటుచేసినట్టు తెలిపారు. దిశ యాప్ ద్వారా క్షణాల్లో ఘటనా స్థలానికి చేరుకుని, బాధితులను ఇంటివద్ద దిగబెడుతున్నామన్నారు. పెదపూడి మండలం కాండ్రేగుల వద్ద మహిళపై హత్య జరిగిన 138 రోజుల్లోనే నిందితునికి యావజ్జీవ కారాగారశిక్ష పడేలా చేశామన్నారు. ఏలేశ్వరంలో బాలికపై అత్యాచారం జరిగితే ముద్దాయికి ఏడేళ్లు, పెద్దాపురం కేసులో పదేళ్లు కారాగార శిక్ష పడిందని ఎస్పీ వివరించారు. ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరచుకుని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సిబ్బందికి ఆయన సూచించారు. ఉమెన్ హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి, స్టేషన్‌కు వచ్చే మహిళల సమస్యలు అడిగి తెలసుకునేందుకు మహిళాపోలీసును, హోమ్‌గార్డును నియమించామని అన్నారు. పోలీసుస్టేషన్‌కు వచ్చిన ప్రతి ఒక్కరితో మర్యాదపూర్వకంగా మాట్లాడుతూ, ఫ్రెండ్లీ పోలీసుగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. ముందుగా కరప పోలీసుస్టేషన్ రికార్డులను తనిఖీచేసి, స్టేషన్ నిర్వహణ, ఎన్ని కేసులు నమోదయ్యాయి, ఎన్నింటిని పరిష్కరించిందీ తెలుసుకున్నారు. ఎస్సై నౌడు రామకృష్ణ, ఏఎస్సై జి.ప్రసన్నకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

కోడిపందేలపై దాడి

గండేపల్లి: కోడి పందేలపై దాడి చేసి, ఐదుగురిని అరెస్టు చేసినట్టు గండేపల్లి ఎస్ఐ వై.గణేష్‌కుమార్ గురువారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని యల్లమిల్లి గ్రామ శివారులో పందెం ఆడుతున్న వారిపై దాడి జరిపి, ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రెండు కోడి పుంజులు, రెండు కోడి కత్తులు, రూ.8200 నగదును స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.